క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 26న విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. ఆర్టీసీ కాలనీ ప్రాంతంలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

తమలపాకులతో శ్వేతార్కుడికి అలంకరణ



కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో స్వామి వారికి తమలపాకులతో గురువారం ప్రత్యేక అలంకరణ పూజలు చేశారు. కొంతమంది భక్తులు కృష్ణ, గోదావరి, ప్రయాగ్‌రాజ్ గంగా నదుల నుంచి సేకరించి తెచ్చిన జలాలతో శ్వేతార్కుడికి అభిషేకం జరిపించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు రాధాకృష్ణశర్మ ఆధ్వర్యంలో అర్చకుడు టంటం హరిస్వామి శాస్త్రోక్తంగా తమలపాకులతో స్వామి వారికి అలంకరణ చేశారు. భక్తులకు అన్నపూర్ణ భవనంలో మహాన్నదానం చేశారు. అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ, సాయికృష్ణ శర్మ, గంగుల రాజిరెడ్డి, గంట శ్రీనమ్మ, దుర్గం సుధీర్, మణిదీప్, రవి తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం




హసన్‌పర్తి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి గురువారం పాలాభిషేకం చేశారు. హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌కు చెందిన రైతు సముద్రాల మధు తన వ్యవసాయ పొలంలో ఈకార్యక్రమం చేపట్టారు. వరంగల్‌లో జరిగిన జన జాతర సభ సందర్భంగా ఆగస్టు 15లోపు రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని సీఎం ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి



మడికొండ: భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను గెలిపించాలని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి పిలుపునిచ్చారు. కాజీపేట మండలం రాంపూర్‌లో గురువారం నిర్వహించిన మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్లుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేస్తూ పాలన కొనసాగిస్తోందని ఆరోపించారు. మతోన్మాద విధానాలను అవలంబిస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, మునిగాల భిక్షపతి, మాలోతు శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



మామునూరు: ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట గ్రామానికి చెందిన నాగపూరి సరోజన ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గతేడాది ఆమె భర్త, కుమారుడు మరణించారు. ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యులను సామాజిక సేవకుడు అల్లం బాలకిశోర్ రెడ్డి గురువారం పరామర్శించి గీసుగొండకు చెందిన విష్ణుచందర్ చేతుల మీదుగా రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో సోల్తీ నరేందర్, మచ్చిక రాజు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



హన్మకొండ: ట్రాన్స్‌కో, జెన్‌కో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ రిజ్వీని తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ నాయకులు కలిశారు. హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధలో సీఎండీ రిజ్వీని గురువారం కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగులు కోరారు. ఈమేరకు ఆయనకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.రవీందర్, ప్రధాన కార్యదర్శి మన్నె శశికుమార్, సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ వేణుగోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ రావు రమణరెడ్డి, నాయకులు తక్కళ్లపల్లి చందర్‌రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మార్కెట్‌లో మాయాజాలం

- మిర్చిని కోల్డ్ స్టోరేజీల్లో పెడతామని అడ్తిదారుల దందా
- రైతులకు సమాచారం లేకుండానే పంట విక్రయం
- నిబంధనలకు విరుద్ధంగా రూ.4 శాతం కమీషన్ వసూలు



మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన మిర్చి

వరంగల్ : వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో అడ్తిదారులు (కమీషన్) మాయాజాలాన్ని ప్రదర్శిస్తున్నారు. ఈసీజన్‌లో ఇప్పటికే మిర్చి పెద్ద మొత్తంలో మార్కెట్‌కు రావడం, కోల్డ్‌స్టోరేజీల్లో స్థలం లేకపోవడంతో ధరలను తగ్గించారు. మిర్చిని అమ్ముకుందామని వచ్చిన రైతులు మార్కెట్‌లోని ధరలను చూసి నిరాశ చెందుతున్నారు. గత వారం కంటే క్వింటాలుకు రెండుమూడు వేల రూపాయలు ధర తక్కువ ఉన్నందున కోల్డ్‌స్టోరేజీల్లో పెట్టేందుకు రైతులు సంబంధిత అడ్తిదారులను ఆశ్రయించారు. దీంతో వారు సరే అంటూ కొంత నగదును ఇవ్వడంతో ఇంటికి తిరుగుముఖం పడుతున్నారు. కానీ, అదేరోజు అడ్తిదారులు మార్కెట్‌లో ఉన్న ధర కంటే రూ.రెండుమూడు వేలకు ఎక్కువగా ట్రేడర్లకు అమ్ముకుంటున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ధరలు పెరిగిన సమాచారం తెలిసిన రైతులు మార్కెట్‌కు వస్తే మీ సరుకులు అదేరోజు విక్రయించామని, మిగిలిన డబ్బులను తీసుకుపోవాలని అడ్తిదారులు చెప్పడంతో రైతులకు నోటిమాట రావడం లేదని తెలుస్తోంది. ఇదేంటని ప్రశ్నిస్తే కొన్ని డబ్బులు తీసుకున్న సమయంలో అమ్మితే అమ్ము లేకుంటే కోల్డ్‌స్టోరేజీల్లో పెట్టు అన్నావని బుకాయిస్తున్నారు. కావాలంటే నీపక్కన ఉన్న ఈ రైతును అడుగు అని తప్పుడు సాక్ష్యాలను పుట్టిస్తుండడంతో ఏమి చేయలేక పోతున్నామని వారు ఆందోళన చెందుతున్నారు.

కోల్డ్ స్టోరేజీకి వెళ్లే దారిలోనే..

మార్కెట్ నుంచి మిర్చిని కోల్డ్‌స్టోరేజీలకు తీసుకువెళ్తున్న క్రమంలోనే అడ్తిదారులు దందాకు తెరలేపుతున్నారు. ధర తక్కువ ఉన్నందున మిర్చి విక్రయించమని రైతులు అడ్తిదారులకు చెప్పడంతో కోల్డ్‌స్టోరేజీకి తీసుకెళ్లేందుకు పాస్ రాయించుకుంటున్నారు. సరుకు మెయిన్‌గేట్ దాటగానే మరో ట్రేడర్‌కు అమ్ముతున్నారు. అడ్తిదారులు ముందుగానే ట్రేడర్లతో మిర్చికి రేటును మాట్లాడుకుని రైతులకు తక్కువ ధర పడుతుందని చెబుతున్నారు. దీంతో ఈవారం వద్దు కోల్డ్‌స్టోరేజీల్లో పెట్టాలని రైతులు చెబుతున్నారు. సరే స్టోరేజీకి తీసుకుపోతున్నట్లు రైతులకు పట్టి ఇచ్చి బయటకు వెళ్లగానే విక్రయాలు సాగిస్తున్నారు. కోల్డ్‌స్టోరేజీల్లో స్థలం లేక పోవడంతో అమ్మకాలు తప్పలేదంటూ అడ్తిదారులు చెబుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

కమీషన్ వసూలు చేస్తూ దోపిడీ

మార్కెట్‌లో మిర్చి అమ్మకాలు చేస్తే 2 శాతం కమీషన్‌ను మార్కెట్ కమిటీకి చెల్లించాల్సి ఉంటుంది. కానీ, అనధికారికంగా 4 శాతం కమీషన్‌ను రైతుల నుంచి అడ్తిదారులు వసూలు చేస్తున్నారు. 4 శాతం ఏమిటని అడిగితే అది అంతే అన్న సమాధానం కమీషన్‌దారుల నుంచి వస్తున్నదని రైతులు వాపోతున్నారు. ఈ అక్రమ వసూళ్లు బహిరంగ రహస్యమే అయినా మార్కెట్ కమిటీ అధికారులు, రైతు సంఘాల నాయకులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మార్కెట్‌లో అడ్తిదారుల దందాను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటే ఆయుధం



ఓటర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న బల్దియా అధికారులు

వరంగల్ అర్బన్ : ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటే ఆయుధమని వరంగల్ జిల్లా స్వీప్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి అన్నారు. వరంగల్ లోక్‌సభ పరిధిలోని తూర్పు నియోజకవర్గానికి సంబంధించిన స్వీప్ అవగాహన సదస్సు గురువారం మెప్మా భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జిల్లా పరిధిలో ఓటింగ్ శాతం పెంచడానికి వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ఓటు వేసి సమర్థుడైన నాయకుడిని ఎన్నుకోవాలని కోరారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాల్లో భారత్ ఒకటని పేర్కొన్నారు. ప్రధాన కూడళ్లు, రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లలో సెల్ఫీ పాయింట్ల ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరుతూ విస్తృత ప్రచారం చేస్తున్నట్లు వెల్లడించారు.

బల్దియా ఆవరణలో ముగ్గుల పోటీలు

బల్దియా ప్రధాన కార్యాలయ ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను మహిళలకు ప్రదానం చేశారు. అదేవిధంగా పోటీల్లో పాల్గొన్న మహిళలకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను అధికారుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మహిళలతో ఎన్నికల ప్రతిజ్ఞ చేయించారు. అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్, డీపీఆర్వో ఆయూబ్, పోలింగ్ మెటీరియల్ నోడల్ అధికారి విజయలక్ష్మి, పీడబ్ల్యూడీ చీఫ్ నోడల్ అధికారి సత్యలక్ష్మి, సీడీపీఓ విశ్వజ, యూనియన్ బ్యాంకు రీజనల్ మేనేజర్ సత్యం, లీడ్ బ్యాంకు మేనేజర్ రాజు, వరంగల్ తూర్పు నియోజకవర్గ నోడల్ అధికారి రాజేష్ కుమార్, టీఎంసీ రమేశ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకట రమణి, సీఓలు, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలి

ఖిలా వరంగల్ : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యాన్ని విక్రయించాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి సీహెచ్.శివప్రసాద్‌రెడ్డి సూచించారు. అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి ఆదేశాల మేరకు జిల్లా పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. యాసంగిలో 56 ఐకేపీ సెంటర్ల ద్వారా 5171.080 మెట్రిక్ టన్నులు, 130 పీఏసీఎస్ కేంద్రాల ద్వారా 2583.080, మెప్మా ఒక సెంటర్ ద్వారా 283.100 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని వెల్లడించారు. మొత్తం 189 కేంద్రాల ద్వారా 1,420 మంది రైతుల నుంచి రూ.17.7 కోట్ల విలువైన 8037.260 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు వివరించారు. ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో రూ.123 కోట్లు జమ చేశామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, టార్పాలిన్ కవర్లు అవసరమున్న చోట సమకూర్చుకోవాలని, కాంటాలు అయిన వెంటనే ధాన్యాన్ని రవాణా చేయాలని నిర్వాహకులకు సూచించారు. 17శాతం లోపు తేమ కలిగిన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తేవాలని కోరారు. ఏ గ్రేడ్ రకానికి రూ.2,203, కామన్ రకానికి రూ.2,183 చెల్లిస్తుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు ఉంటే 7995050785 కాల్‌సెంటర్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులతో ప్రిన్సిపాల్ అరుణ డీహెచ్.రావు

రామన్నపేట: నగరంలోని ఎల్బీ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి సత్తా చాటినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్.రావు తెలిపారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో ముప్పిడి అశ్రిత (452 మార్కులు), అల్లి హిమనిధి (436), బైపీసీ విభాగంలో అభిగ్నబంధు (427), మాసున్ అలీ (402), కుసుమ పృథ్వీ (395), సీఈసీ విభాగంలో కోట భాగ్యలక్ష్మి (477), ఆసియా బేగం (443), శ్రావణి 437 మార్కులు సాధించినట్లు ఆమె వివరించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ కె.రాజేందర్‌రెడ్డి, ఇంటర్ కోఆర్డినేటర్ ముంద్రాతి సదానందం, సిబ్బంది గురువారం అభినందించారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ

మడికొండ: ఇంటర్ ఫలితాల్లో సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ ఎండీ.ఖుర్షీద్ తెలిపారు. ఎంపీసీ సెకండియర్‌లో భరత్ 1000 మార్కులకు 981 మార్కులు, బాలరాజ్ 981, సందీప్ 970, బైపీసీలో విష్ణువర్ధన్ 969, శ్రావణ్‌కుమార్ 961 మార్కులు సాధించారని తెలిపారు. మొదటి సంవత్సరంలో జశ్వంత్ 470 మార్కులకు 462, ప్రణీత్ కుమార్ 461, శంకర్ సింగ్ 461, బైపీసీలో భరత్‌కుమార్ 440 మార్కులకు 422, రాజబాబు 419, శివకృష్ణ 415 మార్కులు సాధించారని వివరించారు. అలాగే, జేఈఈలో సందీప్ 90.24, జశ్వంత్ 84.61, బాలరాజు 80.90 పర్సంటైల్ సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను గురువారం పలువురు అభినందించారు.

బదిలీ అయిన కాంట్రాక్టు ఉద్యోగులను రిలీవ్ చేస్తూ ఉత్తర్వులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఇటీవల కాంట్రాక్టు ఉద్యోగులను బదిలీ చేస్తూ కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఉత్తర్వులు జారీచేయగా, ఇంకా 37మంది కాంట్రాక్టు ఉద్యోగులు తాము పనిచేస్తున్న స్థానాల నుంచి రిలీవ్ కాలేదు. మరికొన్ని చోట్ల డ్రాయింగ్ ఆఫీసర్లు రిలీవ్ చేయలేదని తెలుస్తోంది. దాంతో వివిధ విభాగాలు, వర్సిటీ కళాశాలల్లో పనిచేస్తున్న బదిలీ అయిన 37మంది కాంట్రాక్టు ఉద్యోగులను ఏకంగా రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఈనెల 24న రిలీవ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. వాస్తవంగా డ్రాయింగ్ ఆఫీసర్లే వారి పరిధిలో బదిలీ అయిన కాంట్రాక్టు ఉద్యోగులను రిలీవ్ చేయాల్సి ఉంటుంది. కాంట్రాక్టు ఉద్యోగులు బదిలీ అయిన తరువాత కూడా గత కొద్దిరోజుల నుంచి రిలీవ్ కాకపోవటంతో వారి జాబితాతో కూడిన రిలీవ్ ఉత్తర్వులు రిజిస్ట్రార్ జారీచేశారు. దీంతో కొందరు గురువారం రిలీవ్‌అయి తమకు కేటాయించిన చోటుకు చేరారని సమాచారం. మరికొందరు రిలీవ్ కాలేదని తెలుస్తోంది.

మలేరియాను నియంత్రించాలి



సదస్సులో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ

- వరంగల్ డీఎంహెచ్ఓ వెంకటరమణ

గీసుకొండ : రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని మలేరియా నియంత్రణ చర్యలు చేపట్టాలని డీఎంహెచ్ఓ కె.వెంకటరమణ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం కీటక జనిత వ్యాధులపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. సదస్సులో డాక్టర్ కిరణ్, యశస్విని, ఇన్‌చార్జ్ అసిస్టెంట్ మలేరియా అధికారి మాడిశెట్టి శ్రీనివాస్, విజయేంద్రకుమార్, పాలకుర్తి సదానందం, మధుకర్, రాజశేఖర్, చక్రపాణి, కుమారస్వామి, పట్టణ ఆరోగ్య కేంద్రాల సిబ్బంది, ఆశ కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మేడే వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖిలా వరంగల్: మేడే 138వ దినోత్సవం సందర్భంగా వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మేడే వాల్‌పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ మాట్లాడారు. 1867న ఇంగ్లాండులో కార్మిక సంఘం ఏర్పడిందని, మే 1న ప్రపంచ కార్మిక దినోత్సవం జరుపుకుంటున్నట్లు గుర్తుచేశారు. మేడే దినోత్సవానికి కార్మిక లోకం హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ప్రతినిధులు మునీశ్వరుడు, కృష్ణ, ఎండీ.యాకూబ్, గోవర్ధన్‌చారి, శంకర్, కుమార్, సాంబయ్య, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.



నయీంనగర్: డబ్బాల్ సెంటర్‌లో..

డబ్బాల్ సెంటర్‌లో..

నయీంనగర్: మేడే ఉత్సవాలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ అనుబంధ భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లను పెగడపల్లి డబ్బాల్ సెంటర్‌లో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా సమితి అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఖండించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీని గద్దెదించే విధంగా కార్మికవర్గం ఐక్యం కావాలని సూచించారు. గుంటి రాజేందర్, జనార్దన్, రవి, రమేష్, సతీష్, పూజారి, దేవేందర్ పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో గ్రావిటీ విద్యార్థుల ప్రభంజనం

హన్మకొండ: జేఈఈ మెయిన్స్‌లో హనుమకొండలోని గ్రావిటీ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. తమ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయి ర్యాంకులు సాధించారని కళాశాల యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. జి.అంజయ్య 370, బి.సాయిగణేష్ 2329, పి.రఘునందన్ 5230, బి.మహేష్ 6050, బి.చరణ్ 6800, బి.బన్నీ 7506 ర్యాంకులు సాధించారని వివరించింది. ఆ విద్యార్థులను యాజమాన్యం అభినందించింది. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు డి.మహేష్, ఎం.నర్సింహారావు, ఎస్.అమరేందర్ రెడ్డి, కె.సందీప్, ఎం.సంతోష్ రెడ్డి, టి.శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ తోటలను కాపాడుకోవాలి



తిమ్మాపూర్‌లో మాట్లాడుతున్న అశోక్ రెడ్డి

హన్మకొండ: వేసవిలో ఆయిల్ పామ్ తోటలను కాపాడుకోవడానికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యాన శాఖ రాష్ట్ర సంచాలకుడు కె.అశోక్ రెడ్డి అన్నారు. గురువారం వరంగల్, హనుమకొండ జిల్లా ఉద్యాన అధికారి కార్యాలయంనుంచి వేసవిలో పామాయిల్ మొక్కల సంరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఉద్యానశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం తిమ్మాపూర్‌లోని కెవిన్ బయోసైన్సెస్‌కు చెందిన నర్సరీని సందర్శించారు. ఎల్కతుర్తి మండలం దామెరలోని ఎడ్ల రవీందర్ రెడ్డి ఆయిల్ పామ్ తోటను సందర్శించారు. వరంగల్, హనుమకొండ జిల్లాల ఉద్యాన శాఖాధికారి శ్రీనివాస్‌రావు, ఉద్యాన అధికారి (టెక్నికల్) శంకర్ పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో రెజోనెన్స్ విజయభేరి



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

హన్మకొండ: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రకటించిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో హనుమకొండలోని రెజోనెన్స్ విద్యాసంస్థల విద్యార్థులు విజయభేరి మోగించారు. తమ విద్యార్థులు జాతీయ స్థాయిలో 34వ ర్యాంకుతో పాటు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని రెజోనెన్స్ విద్యాసంస్థల చైర్మన్ లెక్కల రాజిరెడ్డి తెలిపారు. ఎ.భరత్‌కుమార్ 34వ ర్యాంకు, టి.శ్రీతమ్ 71, ఎస్.మాలిక్ 99.60 పర్సంటైల్‌తో 142వ ర్యాంకు, హెచ్.హరిచరణ్ 99.82 పర్సంటైల్‌తో 371, ఎల్.సంజన 96.46 పర్సంటైల్‌తో 406, సీహెచ్.ధీరజ్ 99.96 పర్సంటైల్‌తో 755, టి.రేనిత్ 99.68 పర్సంటైల్‌తో 1064, కె.జీవన్ పాటిల్ 97.56 పర్సంటైల్‌తో 1123, బి.రాంచరణ్ 92.43 పర్సంటైల్‌తో 1176, ఎం.ధీరజ్ 99.33 పర్సంటైల్‌తో 1545, బి.అరవింద్ 86.05 పర్సంటైల్‌తో 2808 ర్యాంకు సాధించారని వివరించారు. అదేవిధంగా ఎ.సాయి శ్రీనివాస్ 99.81 పర్సంటైల్, టి.వెంకటసాయి ప్రణీత్ 99.67, డి.శ్రీతేజ 99.41, వి.చంద్రశేఖర్ 99.31, బాలఆదిత్య 99.15 పర్సంటైల్ సాధించారని చెప్పారు. మే 26న జరగనున్న జేఈఈ అడ్వాన్స్ టెస్టుకు తమ విద్యాసంస్థల నుంచి 314 మంది అర్హత సాధించారన్నారు. కళాశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను చైర్మన్ లెక్కల రాజిరెడ్డి, డైరెక్టర్లు లెక్కల మహేందర్ రెడ్డి, మాదిరెడ్డి దేవేందర్ రెడ్డి, సీఈఓ లెక్కల రమ్యారెడ్డి, అకడమిక్ డీన్ ఎస్.గోపాల్ రావు అభినందించారు.

సంక్షిప్తంగా

ఆటోడ్రైవర్ అజీమ్ నిజాయితీ

రామన్నపేట: ఆటోలో బాధితురాలు పోగొట్టుకున్న బ్యాగును పోలీసు సమక్షంలో అప్పగించి తన నిజాయితీ చాటుకున్న ఆటోడ్రైవర్ అజీమ్‌ను ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ అభినందించారు. నగరానికి చెందిన శ్రావణి.. షాపింగ్ చేసేందుకు హనుమకొండ చౌరస్తాలో అజీమ్‌కు చెందిన ఆటోలో ఎక్కి వరంగల్ చౌరస్తాలో హడావిడిగా దిగిపోయారు. అనంతరం, నాలుగు తులాల బంగారు నెక్లెస్, రూ.40 వేల నగదు ఉన్న తన బ్యాగ్‌ను ఆటోలో మరిచిపోయానని ఏడుస్తూ ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌కు బాధితురాలు చేరుకుంది. అంతలోనే ఆటోడ్రైవర్ అజీమ్ ఆ బ్యాగ్‌తో పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. ఇన్‌స్పెక్టర్ శివకుమార్ సమక్షంలో బాధితురాలు శ్రావణికి బ్యాగును అప్పగించారు. దాంతో అజీమ్‌కు శ్రావణి కృతజ్ఞతలు తెలిపి, రూ.వేయి నగదును కానుకగా అందించారు.

రేపు ఓయూలో మాదిగ విద్యార్థుల సదస్సు

కేయూ క్యాంపస్: ఉస్మానియా యూనివర్సిటీలో ఈనెల 27న నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీల మాదిగ విద్యార్థుల సదస్సును విజయవంతం చేయాలని ఎంఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సందె కార్తీక్‌మాదిగ పిలుపునిచ్చారు. కాకతీయ యూనివర్సిటీ గెస్ట్‌హౌస్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాకతీయ యూనివర్సిటీ నుంచి అధిక సంఖ్యలో తరలి రావాలని సూచించారు. సమావేశంలో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి ముక్కెర ముఖేష్, కేయూ ఇన్‌చార్జ్ డాక్టర్ వడ్డెపెల్లి మధుకర్ మాదిగ, ఎంఎస్ఎఫ్ కేయూ అధ్యక్షుడు శ్రీనాథ్, సీనియర్ బాధ్యులు చాగంటి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

హన్మకొండ చౌరస్తా: వీరశైవ లింగాయత్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హనుమకొండ చౌరస్తాలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సంఘం బాధ్యులు గురువారం ప్రారంభించారు. వచ్చే నెల 10వ తేదీన మహాత్మా బసవేశ్వరుడి జయంతి ఉత్సవాల సందర్భంగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సంఘం అధ్యక్షుడు రాజయ్య తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు ఈశ్వరయ్య, విధుమౌళి, సురేష్‌బాబు, సోమయ్య, సర్వేశ్వర్‌రావు, గౌరీశంకర్ పాల్గొన్నారు.

గంగమ్మతల్లికి సామూహిక కుంకుమ పూజ

ఖిలా వరంగల్: గంగమ్మ తల్లి, పోతరాజు స్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగంగా రెండవ రోజు గురువారం రంగశాయిపేటలోని బెస్తం చెరువులో గంగపుత్ర సంఘం సభ్యులు, వేద పండితుడు పోలోజు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో విగ్రహాలకు శోభాయాత్ర నిర్వహించి సాయంత్రం ధాన్యాదివాసం చేపట్టారు. సాయంత్రం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు.

పరామర్శ

కాశిబుగ్గ: చాత్తాద శ్రీవైష్ణవ సంఘం జిల్లా అధ్యక్షుడు, టీఎన్జీఓస్ జిల్లా ఉపాధ్యక్షుడు రామానుజం జగదీశ్వర్‌కు గుండెపోటు రావడంతో వరంగల్‌లోని సంరక్ష సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈమేరకు ఆయనను చాత్తాద శ్రీవైష్ణవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశ్వాపురం వేణుమాధవ్, తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ, టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్, గోవిందరాజ స్వామి ప్రధాన అర్చకుడు వరయోగుల శ్రీనివాసస్వామి గురువారం పరామర్శించారు.

అనారోగ్యంతో హెడ్ కానిస్టేబుల్ మృతి

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పోలీస్ కంట్రోల్ రూమ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రశాంత్‌కుమార్ కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుడిబండల్‌లోని తన స్వగృహంలో గురువారం మరణించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రశాంత్‌కుమార్ మృతి పట్ల సీపీ అంబర్ కిషోర్ ఝా, డీసీపీ బారీ, ఏసీపీ దేవేందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సతీష్, సిబ్బంది, తోటి సహ ఉద్యోగులు విచారం వ్యక్తం చేశారు.

డిగ్రీ కళాశాలలకు వేసవి సెలవులివ్వాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలలకు వేసవి సెలవులు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ సురేందర్‌రెడ్డి, బాధ్యులు కోరారు. ఈమేరకు కేయూ వీసీ తాటికొండ రమేష్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. కేడీసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి, ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం బాధ్యులు వెంకన్న, రామకృష్ణారెడ్డి, డాక్టర్ రమేష్ ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీలోకి వలసలు

హసన్‌పర్తి: వర్ధన్నపేటలో పలువురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్ కండువా కప్పుకోగా, ఆయా డివిజన్లలోని పలువురు డివిజన్ అధ్యక్షులు కూడా అదేబాట పట్టారు. వర్ధన్నపేట, పర్వతగిరి, ఉమ్మడి హనుమకొండ, హసన్‌పర్తి మండలాల్లో బీఆర్ఎస్ పార్టీలో సంక్షోభం నెలకొంది. రెండు రోజుల క్రితం 55వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రజిత, మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే నాగరాజు సమక్షంలో 2వ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు జంగా కుమార్ కాంగ్రెస్‌పార్టీలో చేరారు.

సిటీ మహిళా కళాశాలలో మెగా జాబ్‌మేళా

హన్మకొండ: హనుమకొండ కిషన్‌పురలోని సిటీ మహిళా కళాశాలలో గురువారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. మల్టీ నేషనల్ కంపెనీలు పాల్గొని విద్యార్థులు, అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి, ఉద్యోగాలకు ఎంపిక చేశాయి.

క్రమశిక్షణతోనే ఉత్తమ ఫలితాలు

- ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి



సాంప్రదాయ వస్త్రాధారణలో విద్యార్థినులు

హసన్‌పర్తి : క్రమశిక్షణతోనే ఉత్తమ ఫలితాలు సాధ్యమని ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఎ. వరదారెడ్డి అన్నారు. అన్నాసాగరం శివారులోని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులు నిర్వహించనున్న శ్రీథమ్–24 వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఎ. వరదారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థినుల్లోని సృజనాత్మక శక్తులను వెలికితీయడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. నాణ్యమైన విద్యనందించడంలో కళాశాల యాజమాన్యం ముందు వరుసలో ఉందన్నారు. ఈసందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన వస్త్రాధారణ ఆహుతులను ఆకట్టుకుంది. కార్యక్రమం సందర్భంగా కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను వరదారెడ్డి ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్యక్రమ కన్వీనర్లు డాక్టర్ పుష్పలత, ఎం.రంజిత్‌కుమార్, రాము, డాక్టర్ కె. మహేందర్‌రెడ్డి, డాక్టర్ సుదర్శన్, డాక్టర్ ఎస్.శ్రీవాణి, ఏఓ వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



ఖిలా వరంగల్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకుని, సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకోవాలని ఏఆర్ఓ, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. వరంగల్ ఫోర్ట్‌రోడ్డు వరంగల్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్‌లోని 121 నుంచి 124వ బూత్ పరిధిలో బీఎల్ఓలు ఆధ్వర్యంలో ఓటర్ చీటీల పంపిణీ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావుతో కలిసి ఓటర్ స్లిప్పుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో బీఎల్ఓలు శశికళ, సుభాషిణి, జయ, భాగ్య తదితరులు పాల్గొన్నారు.